క్లుప్తంగా

వాసుబాబుకు అభినందనలు



పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన బండారు నాగరాజు

ఉంగుటూరు: మండలంలో నారాయణపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజుకు వైఎస్సార్ సీపీ వీవర్స్ నియోజకవర్గం అధ్యక్షుడుగా నియామకం జరగడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జీ పుప్పాల వాసుబాబును బండారు నాగరాజు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీవర్స్‌లో చైతనం నింపి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నాగరాజు పేర్కొన్నారు.

గంగన్నగూడెంలో టీకాలు



గంగన్నగూడెంలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గర్భిణులు, మహిళలు, చిన్నారులు టీకాలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. గోపన్నపాలెం, గంగన్నగూడెం గ్రామాల్లో గర్భిణులు, చిన్నారులకు ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం జరిగింది. వైద్య పరమైన సూచనలు ఇచ్చారు. ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్ఎం భవాని ఉన్నారు.

మహిళలకు 90 రోజులు కుట్టు శిక్షణ

దెందులూరు: మహిళలకు 90 రోజులు పాటు కుట్టు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని శిక్షణ అనంతరం ఉచితంగా మిషన్ ఇస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ బీ.సుమతి, గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ, నాయకులు, ఉద్యోగులు, మహిళలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: మండలంలో 8 గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ తెలిపారు. ధర్మారావుపాలెం, మేదినరావుపాలెం, తిమ్మన్నగూడెం, ముప్పవరం, గండేవారిగూడెం, కెఎస్ పురం, మలకచర్ల, రామారావుగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఆ గ్రామాల్లో వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఎఈ కోరారు.

ఈనెల 16న విద్యుత్ అంతరాయం

ఏలూరు : పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి రామసింగవరం సబ్ స్టేషను పరిధిలో ఆర్డీఎస్ఎస్ పథకం పనుల నిమిత్తం ఈనెల 16న శుక్రవారం నాడు ఉదయం 09:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని, రామసింగవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ఆపరేషన్ కె.ఎం. అంబేద్కర్ తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

శిక్షణ తరగతుల తనిఖీ



శిక్షణ తరగతులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో పది, ఇంటర్ తరగతులు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను దెందులూరు మండల విద్యాశాఖ అధికారిని కే అన్నమ్మ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు వస్తున్న సమయం ఉపాధ్యాయులు శిక్షణ విధానం సమయపాలన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారం విద్యార్థుల ఆసక్తి ఇతర అన్ని అంశాలను ఎంఈఓ అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉత్తీర్ణత పొంది ఉజ్వల భవిష్యత్తు సాధించాలన్నారు. శిక్షణ తరగతులు విధిగా జరగాలన్నారు. ఎంఈఓ వెంట హెచ్ఎం మల్లికార్జునరావు సైన్స్ టీచర్ గణేష్ గ్రంథపాలకులు వెంకటేశ్వరరావు ఉన్నారు.

రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలి

చింతలపూడి: గ్రామంలో తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రసంగరాజు ఆదేశించారు. గురువారం చింతలపూడి మండలం, ఎర్రంపల్లి, ప్రగడవరం గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్తకుప్పలు, పెంట కుప్పలు లేకుండా రోడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా వర్మీకంపోస్ట్ ప్రాసెస్ యూనిట్‌ను పరిశీలించారు.

భవన నిర్మాణ కార్మికులకు ఏదీ ఆసరా!

- సంక్షేమ పథకంపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- సభ్యత్వ నమోదులోనూ వెనుకబాటు
- కార్మికుల ప్రమాదాలపై ఏదో విధంగా తప్పించుకుంటున్న యజమానులు



నిర్మాణంలో ఉన్న భవనం

దెందులూరు: భవన నిర్మాణ కార్మికులు భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం 1998లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభంలో ఈపథకం కేవలం భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఉపయోగపడేది. అనంతర అనేక రకాల పనులు చేసే కార్మికులు ఈ పథకంలో చేరడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులతో పాటు గ్రానైట్ కార్మికులు, ఉపాధి కూలీలు, టైలర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, మెకానిక్ పనులు చేసే కార్మికులు ఈ పథకంలో సభ్యత్వం తీసుకునేందుకు అర్హులు. కానీ దెందులూరు నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకంపై కార్మికులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

దెందులూరు నియోజకవర్గంలో...

నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, భీమడోలు మండలాల్లో వేలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలో కార్పెంటర్లు, టైలర్లు, ఉపాధి కూలీలు, ఎలక్ట్రీషియన్లే అత్యధిక సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అధికారులు అవగాహన కల్పించి సభ్యత్వరం ఇప్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ అధికారులు కార్మికులకు అవగాహన కల్పించడంపై మాత్రం అంతంగానే ఉంది. దీంతో అర్హులైన చాలా మంది కార్మికులు ప్రమాదాల బారినపడి కుటుంబాలను నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందలేకపోతున్నారు. ఫలితం కార్మిక కుటుంబానికి ఎంతో కొంత ముట్టజెప్పి యజమానులు చేతులు దులుపుకొంటున్నారు.

సభ్యత్వ నమోదు ఇలా..

చేతి వృత్తుల కార్మికులు 18నుంచి 60ఏళ్ల మధ్య ఉండాలి. దరఖాస్తు కార్మికుడు రెండు ఫోటోలు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ పుస్తకాం, జిరాక్స్ కాపీలతో పాటు కార్మికుడిపై ఆధారపడి జీవించే వారి అధార్ కార్డు, జిరాక్స్ కాపీలు అందజేయాలి. రూ.120చెల్లించి కార్మిక శాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందవచ్చు. ఒక్కసారి సభ్యత్వం తీసుకున్న వారి లేబర్ కార్డు పరిమితి 5ఏళ్ల వరకూ ఉంటుంది. ఆ తరువాత సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి.

పథకం గురించి చాలా మందికి తెలీదు..

దెందులూరు చుట్టుపక్కలా వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. పనులు చేసే సమయంలో ఎక్కడో ఒకచోట కార్మికులు గాయపడుతున్నారు. కొంతమంది శరీరంలోని కొన్ని అవయాలను కోల్పోతున్నారు. మరికొంతమంది చనిపోతున్నారు. అటువంటి వారికి కార్మిక శాఖ నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందతాయన్న విషయం చాలా మందికి తెలియదు. కార్మిక సంఘ నాయకులు వాటిపై కార్మికులకు అవగాహన కల్పించాలి.

ప్రయోజనాలు :

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.లక్షల ఆర్థిక సాయం వర్తిస్తుంది. 50శాతం అంగవైకల్యం పొందిన వారికి రూ.1లక్ష, సాధారణ మరణం పొందితే రూ.30వేలు ఆర్థికంగా అందిస్తారు. వివాహం తర్వాత కార్మికునికి ఒక్కో కుమార్తెకు కాన్పు సమయంలో రూ.25వేల చొప్పున రెండు కాన్పులకు ఆర్థిక సాయం అందుతుంది. స్వల్పమొత్తం చెల్లించిన సభ్యత్వం పొందడం ద్వారా 5ఏళ్ల పాటు కార్మికుడికి, ఆయన కుటుంబానికి భద్రత లభించడంతో పాటు సంక్షేమ పథకాలను కూడా పొందే సౌలభ్యం ఉంది.

కార్మికులకు అవగాహన కల్పించాలి



అధికారులు భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి పథకాలు వర్తిస్తాయి అనేది తప్పనిసరిగా అవగాహన కల్పించాలి. కార్మికులుగా పనిచేసేవారు చదువుకోకపోవడంతో వారికి జరిగే నష్టం గురించి తెలియదు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు అధికారులతో కలిసి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలను అందించే విధంగా అందరం కృషి చేయాలి.

కాకర్ల శ్రీను, భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

వేగివాడ యువకుల మృతి ఆవేదన కలిగించింది

దెందులూరు: మండలంలోని వేగివాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు నేతల సాగర్, నేతల అజయ్, చొక్కా అఖిలాష్ ప్రమాదవశాత్తు మృతి చెందడం ఆవేదన కలిగించిందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో పరామర్శించారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో మృతుల కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని నైతిక బలాన్ని కలుగచేయాలని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. మరణించిన మూడు కుటుంబాలను త్వరలోనే వచ్చి కలిసి పరామర్శిస్తారని తెలిపారు.

తేలని స్త్రీనిధి నిధుల గోల్‌మాల్ వ్యవహారం

గణపవరం: గణపవరం మండలం ముగ్గుళ్ల గ్రామంలో స్వయం సహాయక సంఘాలకు చెందిన స్త్రీనిధి నిధులు రూ.36 లక్షల గోల్‌మాల్ వ్యవహారం నెల రోజులు కావస్తున్నా నేటికీ కొలిక్కి రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సొమ్ము మాయమైందంటూ తొలుత కొందరు మహిళలు చేసిన ఆరోపణలపై నిర్వహించిన ప్రాథమిక విచారణలో రూ.16 లక్షలు వివోఏ వెంకటలక్ష్మి వాడుకున్నట్లు ఎపిఎం అమీరున్నీసా వెల్లడించారు. దీనిపై గణపవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాను వాడుకున్న సొమ్మును ఏప్రిల్ 15వ తేదీ లోగా చెల్లిస్తానని హామీ ఇచ్చిన వెంకటలక్ష్మి అప్పటినుంచి నేటివరకూ పరారీలోనే ఉండటంతో బాధితమహిళలు ఆందోళన చెందుతున్నారు. దీనితో మహిళలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును కలిసి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఆయన ఈవిషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత మహిళలకు న్యాయం చేయాలని కోరారు. అయినా ఇప్పటివరకూ తమకు న్యాయం జరుగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కోమటిగుంట చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలి

భీమడోలు: స్థానిక కోమటిగుంట మంచినీటి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో బుధవారం రాత్రి ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఓ ఫంక్షన్ కోసం వచ్చిన ముగ్గురు యువకుల ప్రాణాలను కోమటిగుంట తీసుందని పేర్కొన్నారు. ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, చెరువు చుట్టూ ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది కాపలా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారికి పక్కనే చెరువు ఉండడం వాటికి పక్కనే రెస్టారెంట్లు ఉండడంతో యువకులకు మద్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మద్యం విక్రయాలు జరగకుండా వాటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు.

సర్ ఆర్థర్ కాటన్ సేవలు మరువలేనివి

గణపవరం: ఉభయగోదావరి జిల్లాల రైతాంగానికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన సేవలు చిరస్మరణీయమని, గోదావరి జిల్లాలు రాష్ట్రానికే అన్నపూర్ణగా పేరొందడానికి కాటన్ కారణమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ విభాగం కార్యదర్శి నడింపల్లి సోమరాజు అన్నారు. శుక్రవారం కాటన్ జయంతి సందర్భంగా గణపవరం బొబ్బిలి వంతెన వద్ద ఉన్న కాటన్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృధాగా పోతున్న గోదావరి జలాలను ఆనకట్ట కట్టి రైతుల సాగునీటికి మళ్లించి, గోదావరి జిల్లాలను సుసంపన్నం చేసిన ఘనత కాటన్‌కు దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో రుద్రరాజు పుల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.



గణపవరంలో కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సోమరాజు



కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



భీమడోలు కాల్వ వద్ద గల కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడు

దెందులూరు: గోదావరి ప్రాంతాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడని వైఎస్సార్‌సీపీ నాయకులు ధరణికోట పోతురాజు, మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు బొద్దు హేమంత్ అన్నారు. గ్రంథాలయం సెంటర్ వద్ద కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన బత్తినవెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను అభినందించారు. కాటన్ జయంతి వేడుకలు దెందులూరు గ్రంథాలయం సెంటర్‌లో ఘనంగా జరిగాయి. రామదండు నాయకులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. మహోన్నత వ్యక్తిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రామదండు సభ్యులు, గ్రామ రైతులు యువకులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు కాటన్

భీమడోలు: అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ దొర అని పలువురు వక్తలు కొనియాడారు. సర్ ఆర్థర్ కాటర్ 122వ జయంతిని పురస్కరించుకుని ఇరిగేషన్ శాఖ పరిధిలోని భీమడోలు నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం భీమడోలు గోదావరి కాల్వపై ఉన్న కాటర్ దొర విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, ఎఎంసీ చైర్మన్ శేషపుగిరిలు మాట్లాడుతూ గోదావరి జలాలను ఉభయ గోదావరి జిల్లాల ప్రజల చెంతకు తీసుకుని వచ్చిన మహోన్నత వ్యక్తి సర్ ఆర్థర్ కాటన్ అన్నారు. ధవళేశ్వరం వద్ద కాటన్ దొర ఆనకట్ట కట్టి బీడుగా ఉన్న ఈ ప్రాంతాలకు నీరందించి ఈ ప్రాంత అభివృద్ధికి పునాదులు వేసి మహనీయుడన్నారు. నీటిని సంఘం ఉపాధ్యక్షుడు ముప్పిరిశెట్టి శివ, డైరెక్టర్లు ఆదిరెడ్డి సత్యనారాయణ, పెద్దలు పైడిమాల యుగంధర్, ఈతకోట బాబీ, ఇరిగేషన్ ఐజీ ఆర్వీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

గణపవరం: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని జిల్లా అధనపు వైద్యాధికారి బి.భానునాయక్ తెలిపారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, రోగుల గదులు, ఫార్మసీ ల్యాబ్, వార్డులు పరిశీలించారు. ఆరోగ్యకేంద్రం పనితీరు, రోజూ వైద్యం పొందుతున్న పేషెంట్స్ వివరాలు, రికార్డుల నిర్వహణ తీరును వైద్యాధికారి కె.ప్రియాంక బానునాయక్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఎండతీవ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రతి గ్రామంలో ఓఆర్ఎస్ కార్నర్స్‌ను నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీలో ప్రతి రోజూ ఓఆర్ఎస్ ద్రావణం కలిపి సిద్ధంగా ఉంచాలని, ఆస్పత్రికి వచ్చే రోగులలో అవసరమైన వారికి ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ అన్నాకుమారి, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిప్పర పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న భానునాయక్

ఘనంగా ముగిసిన కల్యాణోత్సవాలు

భీమడోలు: దేవదాయ ధర్మశాఖ ఆధీనంలోని గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసాయి. ముగింపు రోజైన గురువారం ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ అన్నప్రసాద వితరణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్త జనం స్వామి వారి అన్నప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఏలూరు నియోజకవర్గ వైస్సార్ సీపీ ఇంచార్జి మామిళ్లపల్లి జయప్రకాష్(జేపీ) ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేసారు. అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ప్రతి ఏటా వార్షిక కల్యాణోత్సవాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఎఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు, మాజీ సర్పంచ్ చిట్టి దుర్గాశంకర్‌రావు, పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నసమారాధనలో నిర్వాహకులను అభినందిస్తున్న జయప్రకాష్

కార్మికులంతా సంఘటితం కావాలి

పెదవేగి : కార్మిక సమస్యల పరిష్కారం కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు కార్మికులు, స్కీమ్ వర్కర్స్, పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా నాయకులు ఏ శ్యామల రాణి డిమాండ్ చేశారు. గురువారం పెదవేగి సొసైటీ ఆఫీస్ వద్ద సీఐటియూ మండల కమిటీ సమావేశం పి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఏ శ్యామల రాణి లేబర్ కోడ్స్ రద్దు, కార్మికులందరికీ కనీస వేతనం రూ 26,000 ఇవ్వాలని బిల్డింగు స్కీం వర్కర్లకు అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని ఆటో, హమాలి తదితర అసంఘటిత రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వల్ల పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ ఆరోగ్య భద్రత పనిగంటలో వారాంతపు సెలవులు తదితర హక్కుల కోల్పోయే ప్రమాదం ఉందని కొత్తగా పెట్టే ఫ్యాక్టరీలో కార్మిక చట్టాలు అమలు కాకుండా నిరోధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తుందన్నారు. ఆశ, మధ్యాహ్నం పథకం, కార్మికులు వివోఏ, కనీస వేతనాలు సామాజిక భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. 20వ తేదీన జరిగే దేశం వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బైగాని రమేష్, టి ఆంజనేయులు, బి రోజా, ఏ వల్లి, ఎస్. తులసి, బి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పెదవేగి సొసైటీ కార్యాలయ ఆవరణలో గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



భీమడోలు లైబ్రరీలో కాటన్ దొర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



విద్యార్థులతో నీతికథలు చెప్పిస్తున్న గ్రంథాలయాధికారి రాంబాబు

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించే ఆధునిక దేవాలయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు ఆదేశాల మేరకు భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 15వ రోజైన గురువారం ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై పుస్తక పఠనం చేసి సమీక్షలు రాసారు. చిన్నారులకు నీతి కథలను వినిపించడం, వారు నీతి కథలు చెప్పడం వంటి వాటిలో ఉత్సాంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. గణితంలో మెలకువలు, జీకే వంటి అంశాలపై గ్రంథపాలకుడు అవగాహన కల్పించారు. విద్యార్థిని తనుశ్రీ ఓ కథలోని సారాంశాన్ని తెలుపుతూ ఎప్పుడు ఎవరిపై ఆధారపడగూడదని, అదే విధంగా ఎవరికి ఎటువంటి హామి ఇవ్వగూడదని చెప్పింది. అనంతరం సర్ ఆర్థర్ కాటన్ దొర 122వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్ కాటన్ దొర ఉభయ గోదావరి వాసులకు నీటిని అందించిన విషయంలో ఆయన స్ఫూర్తిదాయకమైన సేవలందించారన్నారు. బ్రిటిష్ ఇంజనీర్‌గా ఉంటూ గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లకుండా ఆయన ధవళేశ్వరం వద్ద బ్యారేజ్ నిర్మించిన మహనీయుడన్నారు. ఆయన సేవలను ఉభయగోదావరి వాసులు స్మరించుకోవాలన్నారు. అనంతరం చిన్నారులు చదరంగం, కబడ్డీ వంటి ఆటలు ఆడారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సామూహిక పుస్తక పఠనం, భగవద్గీత శ్లోకాలను పఠించారు. గుండుగొలనులో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు నీతి కథలు, జీవిత చరిత్రలు, యోగాసనాలను నేర్పించారు. ఈ కార్యక్రమాల్లో రిసోర్స్‌పర్సన్లు కిషోర్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెప్పడం వినటం అభ్యాసం కావాలి

దెందులూరు: విద్యార్థులందరికీ ప్రాథమిక స్థాయి నుంచి చెప్పటం, వినటం, అభ్యాసం కావాలని పోతునూరు గ్రంథాలయాధికారి జి రాంబాబు అన్నారు. గురువారం పోతునూరు గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు జరిగాయి. సీనియర్ విద్యార్థులతో జూనియర్ విద్యార్థులకు నీతి కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థులు అందరితో పుస్తకాలు పత్రికలు చదివించారు. తల్లిదండ్రులు వేసవి సెలవులు ముగిసే వరకు విద్యార్థులను గ్రంథాలయానికి పంపించాలని సూచించారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని దీక్షలు

బుట్టాయగూడెం: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు మడకం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన హామీ నెరవేర్చాలంటే షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ఒకటే మార్గమన్నారు. గిరిజన సలహా మండలి ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతానికి స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆదివాసీ అగ్రికల్చర్ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగులను స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు మొడియం గంగరాజు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కారం రాఘవ, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుంజం కృష్ణంరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దొంగతనం కేసు నమోదు

కామవరపుకోట: మేకలు దొంగలించి తీసుకెళుతుండగా వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం అక్కంపాలెం గ్రామానికి చెందిన బల్లె విజయ్ కుమార్ 12వ తేదీ రాత్రి కామవరపుకోట కొత్తూరు సబ్ స్టేషన్ సమీపంలో గల బట్టా సత్యనారాయణ ఇంటి ఆవరణలో ఉన్న 20 మేకల్లో ఒక మేకను దొంగిలించి బుధవారం ఏలూరు వైపు తీసుకువెళుతుండగా తడికలపూడి శివారులో అతడిని పట్టుకుని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.